



మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శనివారం 12 సెప్టెంబర్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2





# పేద ఆర్యవైశ్యులకు శ్రీ వాసవి రక్షణ కవచం






భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

కట్టుకున్న భర్త కానరాని లోకాలకు వెళ్లడంతో ఆడ బిడ్డల మీదనే ఆధారపడుతున్న సూర్యాపేటకు చెందిన పేదింటి ఆర్యవైశ్య ఆడపడుచు నీలా రాజ్యలక్ష్మి(70) ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలు కావడంతో తొంటి ఆపరేషన్ చేయాలని డాక్టర్ సూచించగా శుక్రవారం శ్రీ వాసవి రక్షణ కవచం ఆధ్వర్యంలో పదివేల రూపాయలు ఆర్థిక సహకారాన్ని ఆమె కూతురు ఉషారాణికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి రక్షణ కవచం నిర్వాహకులు బచ్చు పురుషోత్తం మాట్లాడుతూ సూర్యాపేటలో మొట్టమొదటిసారిగా శ్రీ వాసవి రక్షణ కవచం సోషల్ మీడియా వేదికగా దాతల సహకారంతో పేద ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ వాసవి రక్షణ కవచం అట్టడుగు వర్గాలలో ఉన్న పేదలకు ప్రతినెల రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ వాసవి రక్షణ కవచంలో భాగస్వామ్యం కావాలనుకునే ఆర్యవైశ్యులు కేవలం ప్రతి నెల 100 చెల్లించి నట్లయితే పేద ఆర్యవైశ్యులకు ప్రతి నెల ఒకరికి సహకారం అందిస్తామని తెలిపారు. శ్రీ వాసవి రక్షణ కవచం ఏర్పాటు చేసిన పది రోజుల్లోనే సుమారు 170 మంది సభ్యులుగా చేరి సహకారం అంది స్తున్నట్లు తెలిపారు. సుమారుగా 500 మంది సభ్యులను చేర్చి ప్రతినెల 50 వేల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి రక్షణ కవచం సభ్యులు కలకోట లక్ష్మయ్య, తప్పీ గాంధీ, చల్లా సత్యనా రాయణ, మిట్టపల్లి రమేష్, దేవరశెట్టి నాగరాజు, సోమా ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులకు సహాయం అందించాలనే ఆలోచనతో శ్రీ వాసవి రక్షణ కవచం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి రక్షణ కవచం సభ్యులు కందిమల్ల మధు సూదన్, కర్నాటి కృష్ణ, నూనె పాండయ్య, జర్నలిస్ట్ కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధించుకునే వరకు ఉద్యమం ఆగదు



భానుపురి /సూర్యాపేట టౌన్

బుల్లెట్ ట్రైన్ రిలే నిరాహార దీక్షలో శుక్రవారం 29వ రోజు సిపిఎం పార్టీ అనుబంధ సంస్థ ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.ఈ దీక్షను మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి ప్రారంభించి మాట్లాడారు.సూర్యాపేట పట్టణంతోపాటు జిల్లా మొత్తం బుల్లెట్ ట్రైన్ సాధించుకునే దిశగా ఉద్యమ బాట పట్టారని మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి అన్నారు. కాలికి గజ్జగట్టి డప్పు చేతపట్టి ప్రజా సమస్యలపై ఎన్ని ఉద్యమాలు చేపట్టిన ప్రజానాట్యమండలి కళాకారులు బుల్లెట్ రైలు సాధన కోసం దీక్షలో పాల్గొన్నారు. కళాకారులు పాల్గొన్న దీక్షలు పాటలు ఆటలతో ఉత్సాహంగా కొనసాగడం ఈ డబ్బు చప్పుళ్ళు ఢిల్లీ గల్లీ వరకు వినిపించేలా ఉద్యమం సాగుతుందన్నారు. ఈ దీక్షలు కళాకారులు వేల్పుల వెంకన్న, బచ్చలకూరి రాంబాబు, యాతకుల ప్రవీణ్, చిత్రం శ్రీను, పల్లెల రాము, నందిపాటి సతీష్, కంపాటి చంద్రశేఖర్, ఉప్పల వెంకట్ గోపి, కందుకూరి శ్రీకాంత్ , నిమ్మాది మనోజ్, పిడమర్తి అశోక్, ప్రభాకర్ సునీత లు దీక్షలో కూర్చున్నారు.

# ఆధ్యాత్మిక సేవలే జీవిత పరమార్థం



భానుపురి /సూర్యాపేట కల్చరల్

ప్రతి వ్యక్తి తన జీవితం మానసిక ప్రశాంతతతో గడపాలంటే ఆధ్యాత్మిక చింతనలతో సాధ్య మౌతుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు మరి శెట్టి లక్షాధి అన్నారు. ఇటీవల నూతనంగా ప్రారంభమైన శాంతినగర్ లోని శ్రీ దుర్గా మల్లేశ్వర దేవాలయం సందర్శించి శ్రీ కనకదుర్గ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణుల ఆశీర్వచనం తో దేవాలయ ట్రస్టు చైర్మన్ ఉప్పల గురునాథం మురిసెట్టి లక్షాధిని ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు సామాజికవేత్త గుండా రమేష్, వీర్లపాటి వెంకటేశ్వర్లు, గజ్జల రవీందర్, నూనె యుగంధర్, ఉప్పల జనార్ధన్, తల్లాడ వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు హాజరైనారు.

# ఆధునిక సాంకేతికతతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం




భానుపురి/ సూర్యాపేట కలెక్టరేట్

జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు వేగంగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గ్రామీణ రెవెన్యూ సర్వేల నుంచి మొదలుకొని ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం వరకు ప్రతి అంశంలోనూ పారదర్శకత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను తగ్గించి, ప్రజలకు మేలైన సేవలు అందించడమే లక్ష్యంగా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో వెబెక్స్ ద్వారా భూ భారతి, ప్రజావాణి దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా చేపడుతున్న గ్రామ సర్వే ప్రక్రియ ఇకపై మరింత సమర్ధవంతంగా పని చేయాలని తెలిపారు. తహసీల్దార్లు, సర్వేయర్లు సమన్వయంతో ప్రతివారం పురోగతి నివేదికలు అందిస్తూ, సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలన్నారు. ప్రజా సమ స్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు అధునాతన ఏఐ, డిజిటల్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో గంటల సమయం పట్టే నివేదికలు, డ్రాఫ్టింగ్ పనులను సాంకేతికత ద్వారా కేవలం కొన్ని నిమిషాల్లోనే నాణ్యతతో పూర్తి చేయవచ్చని వెల్లడించారు. దీనివల్ల అధికారుల పనిభారం తగ్గడమే కాకుండా, పౌరులకు వేగవంతంగా సేవలు అందుతాయన్నారు.

**-భూసమస్యలపై ప్రత్యేక దృష్టి**

మండలాల వారీగా దీర్ఘకాలంగా వేధిస్తున్న ప్రధాన భూసమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక జాబితా రూపొందించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులతో పాటు 60 రోజులకు పైబడి పెండింగ్‌లో ఉన్న భూభారతి కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ బి. హరి సింగ్ డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సంబంధిత సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి






భానుపురి /సూర్యాపేట టౌన్

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్ సి బి ఈ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు అయితగాని మహేష్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా బ్యాంకు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని తెలిపారు. ప్రస్తుతం రెండు శనివారాలు సెలవులు ఉండగా, మిగిలిన రెండు శనివారాలను కూడా సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కష్టమర్లకు బ్యాంకు సేవలు సాయంత్రం నాలుగు గంటలకే ముగిసినా, ఉద్యోగులు మాత్రం రాత్రి తొమ్మిది, పది గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని, దీంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు.5 రోజుల పనిదినాలు అమలు చేసిన కష్టమర్లకు ఇబ్బంది కలగకుండా సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ అదనంగా 40 నిమిషాల పాటు సేవలు అందిం చేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దీనిపై భారతీయ బ్యాంకుల సంఘంతో ఒప్పందం జరిగినప్పటికీ రెండున్నరేళ్లు దాటినా అమలు చేయకపోవడం విచారకరమన్నారు.పనితీరు ఆధారిత ప్రోత్సాహకంలోనూ ఉద్యోగుల మధ్య వివక్ష చూపుతు న్నారని ఆరోపించారు. బ్యాంకుల లాభాల్లో ఉద్యోగుల శ్రమ కీలకమని, అందుకు అనుగుణంగా న్యాయమైన ప్రోత్సాహకం అందించాలని కోరారు. కింది స్థాయి ఉద్యోగులకు 15 రోజుల జీతం ప్రోత్సాహంగా , పైస్థాయి అధికారులకు 365 రోజుల జీతం ప్రోత్సాహంగా ఇవ్వడం సరికాదన్నారు.కేంద్ర ప్రభు త్వం బ్యాంకులను బలహీనపరిచి భవిష్యత్తులో ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగులను విభజించి పాలించే విధానాన్ని సహించబోమని స్పష్టం చేశారు.డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ఫణి, వంశీ, నీల శ్రీనివాస్, ఎస్ రామకృష్ణ, అలీం, శ్రీధర్, నరేష్, వెంకటేశ్వర్లు, వికాస్, సురేష్,నవీన్, కిషోర్, కృష్ణ హేమలత, ప్రియాంక, సౌజన్య, నాగిరెడ్డి, నందన్, ఉమ మహేష్, చిట్టిబాబు, పవన్ శర్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు ప్రారంభం

భానుపురి /సూర్యాపేట టౌన్




నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి భూమి, భుక్తి, విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం సూర్యాపేటలోని కామ్రేడ్ ధర్మ భిక్షం విగ్రహం వద్ద ప్రారంభించి ఆయన మాట్లాడుతూ, “నిజాం నిరంకుశ పాలన ఎంతటి భయానకంగా ఉన్నా ప్రజల పోరాట స్ఫూర్తిని అణచలేకపోయింది. పేద రైతులు, కూలీలు, మహిళలు ఏకమై సాగించిన పోరాటం నిరంకుశ పాలన పునాదులను కదిలించింది” అన్నారు.భూమి కోసం బందూకు పట్టారు... భుక్తి కోసం పోరాడారు... విముక్తి కోసం ప్రాణాలర్పించారు. వారి రక్తంతో తడిసిన తెలంగాణ గడ్డపై ప్రజా పోరాటాల చరిత్ర ఎప్పటికీ చెరిగిపోదు” అని ఆయన అన్నారు.కామ్రేడ్ ధర్మ భిక్షం వంటి మహోన్నత నాయకులు ప్రజల హక్కుల కోసం జీవితాలను అంకితం చేశారని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన ఘన నివాళి అని పేర్కొన్నారు. నేటి తరానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వివరించి, ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. “నిజాం నిరంకుశత్వాన్ని గడగడలాడించిన రైతాంగ పోరాట వీరుల స్ఫూర్తి మన రక్తంలో ఉంది... ప్రజల హక్కులపై దాడి జరిగితే ఆ పోరాట జ్వాల మరోసారి రాజుకుంటుంది అని హెచ్చరించారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ప్రజలు, రైతులు, కార్మికులు, యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వేగవంతం చేయాలి



భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

సూర్యాపేట జిల్లాలో మూడు నియోజక వర్గాలలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం కలెక్టరేట్ వి సి హాల్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 200 కోట్ల రూపాయల వ్యయంతో హుజూర్నగర్ నియోజకవర్గం గడ్డిపల్లి, కోదాడ నియోజక వర్గం చిలుకూరు, తుంగతుర్తి నియోజకవర్గం తొండ లలో మొత్తం 3 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి 600 కోట్ల రూపాయలు ఖర్చు చేయటం జరుగుతుందని, నిర్మాణ పనుల పురోగతి పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయాలని పనులను నాణ్యత ప్రకారం ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇచ్చిన ఆర్కిటెక్చర్ డిజైన్ ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన టువంటి సమగ్ర శిక్ష అభియాన్ పనులను కూడా అనుకున్న సమయం ప్రకారం పూర్తి చేయాలని ఇట్టి పనుల పురోగతిపై ప్రతివారం సమీక్ష సమావేశం నిర్వహి ంచడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సూపరెండెంట్ ఇంజనీర్ భాను ప్రసాద్, డిఇఓ అశోక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ కుమార్, ఏ ఈ ఓబులేష్, గుత్తందారులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు ప్రచార కార్యక్రమం




భానుపురి/ సూర్యాపేట కలెక్టరేట్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)–2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12, 13 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ రెండు రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం–6, 7, 8లతో పాటు డిక్లరేషన్ ఫారాలు పోలింగ్ కేంద్రాల్లో సేకరిస్తారని వివరించారు. ప్రతి ఓటరు సమీపంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సర్–2026 డ్రాఫ్ట్ నోటిఫికేషన్, ఏఎస్డీడీ జాబితాలో తమ పేర్లు సరైన వివరాలతో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కలెక్టర్ కోరారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం–6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు: ఫారం–7, చిరునామా, పేర్ల సవరణలకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ లేదా అనోమలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లు వాటిని నిర్లక్ష్యం చేయకుండా బీఎల్ఓలకు అవసరమైన ఆధార పత్రాలు అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సందేహాలు ఉన్న ఓటర్లకు ప్రక్రియను వివరించి సహకరించాల్సిందిగా బీఎల్ఓలను ఆదేశించినట్లు చెప్పారు.

**–యువ ఓటర్లకు విజ్ఞప్తి**

1.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న లేదా ఆ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న అర్హత కలిగిన యువత తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవాలని, పేరు నమోదు కాకపోతే ఫామ్–6 తో పాటు వాంగ్మూలం సమర్పించడం ద్వారా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, ఎలక్షన్ సిబ్బంది రాజేం దర్ రెడ్డి, భరత్, రణధీర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి



భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పిం చాల్సిన అవసరం ఉందని, ఆయుర్వేదం, యునాని, హోమియోపతి తదితర ఆయుష్ వైద్య విధానాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ఆయుష్ వైద్య విధానాల్లో భాగంగా ఔషధ చికిత్సతో పాటు పంచకర్మ వంటి సాంప్రదాయ చికిత్సా విధానాలను అవసరమైన సందర్భాల్లో శాస్త్రీయ వైద్య ప్రమాణాల ప్రకారం వినియోగిస్తూ వివిధ రుగ్మతల నివారణ, నియం త్రణకు కృషి చేయాలని ఆయుష్ వైద్యులకు కలెక్టర్ సూచించారు. ప్రజలు ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకునేలా గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహి ంచాలని. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆయుష్ వైద్య విధానాలకు ఉన్న ప్రాధాన్యతను వివరించి, అవసర మైన వారికి తగిన వైద్య సలహాలు, మందులు మరియు పంచకర్మ చికిత్సా సేవలను అందుబా టులోకి తీసుకురావాలని సూచించారు. ఆయుష్ వైద్యులు తమ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా ధికారి డా,,పి.వెంకట రమణ, ఐఎంఏ ప్రెసి డెంట్ డా,, రమేశ్ కుమార్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డా,, మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డా,, కోటి రత్నం, డా,, నాజియా తబస్సుం, డా,, శ్రీశైలం, డా,, నాగరాజు, వి సంజీవ్ రెడ్డి, ఉమా మహేశ్వరి, భార్గవ్, అయూష్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం




భానుపురి/సూర్యాపేట టౌన్

ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని సరస్వతీ విద్యా నిలయం కరస్పాండెంట్ పర్వతం శ్రీధర్ పిలుపునిచ్చారు శుక్రవారం సరస్వతీ విద్యాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నల్లగొండ , మాధవస్మారక సమితి సూర్యాపేట వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగని పర్యావరణహితంగా జరుపుకోవాలని ఎవరు కూడా పర్యావరణానికి హాని కలిగించే విధంగా పండుగలు జరుపుకోవద్దని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులు కూడా మట్టి గణపతిని పూజించే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సహకార్యవాహ అమరవాది రాజేష్, జిల్లా ప్రచార ప్రముఖ్ పోశం శివ, ,ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేముల పుష్పక్క ఘన నివాళులు



భానుపురి /కట్టంగూర్

మండల పరిధిలోని కలిమేర గ్రామానికి చెందిన కత్తుల సురేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ప్రజాగాయిని, ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ వేముల పుష్పక్క గ్రామానికి చేరుకుని సురేష్ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ సానుభూతిని తెలియ జేస్తూ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంక రబోయిన వెంకన్న, కలిమేర గ్రామ సర్పంచి తోటకూరి జలజ యాదయ్య, ఉపసర్పంచ్ ఖమ్మంపాటి లింగమ్మ యాదయ్య, కట్టంగూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కత్తుల వెంకన్న, మాజీ సర్పంచ్ గద్దపాటి దానయ్య, మండల యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల సత్యనారాయణ, వార్డ్ మెంబర్ తండు గిరిబాబు, నాయకులు కత్తుల శంకర్, చింత ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం



భానుపురి /సూర్యాపేట టౌన్

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. దళితులు ఉన్నత పదవుల్లోకి ఎదగడాన్ని ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అహం కారపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్, పీసీసీ అధికార ప్రతినిధి దూడెం వెంకట రమణ, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రెడ్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు వింటే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. దూడెం వెంకట రమణ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దళితుల పై ఏనాడూ నిజమైన ప్రేమ లేదని ఆరోపి ంచారు. రాజ్యాంగపరంగా అమలులో ఉన్న రిజర్వే షన్లను అమలు చేయడం తప్ప దళితుల సంక్షేమం, సాధికారత కోసం ఆయన మనస్ఫూర్తిగా చేసిందేమీ లేదని విమర్శించారు. గతంలో దళితుడైన మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఆయనకు సమాన హోదా, గౌరవం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రతిపక్ష హోదా కల్పించలేదని ఆరోపించారు. ప్రస్తుతం దళితుడు గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభ స్పీకర్‌గా ఉన్న నేపథ్యంలో ఆయనను గౌరవిస్తూ లేచి నిలబడి “అధ్యక్షా” అని సంబోధించాల్సి వస్తుందనే అహంకారంతోనే కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా అన్ని సదుపాయాలు, హోదా అనుభవిస్తూ కూడా శాసనసభ సమావేశాలకు హాజరు కాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం శాసనసభ పట్ల బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోందన్నారు. ఈ కార్య క్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

**–నకిరేకల్ మార్కెట్ చైర్ పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి**



భానుపురి /కట్టంగూర్

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవం శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి అంబటి అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ వేడుకకు నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజా నికి దిక్సూచిలా నిలిచి భావి భారత పౌరులను తీర్చిదిద్దే గొప్ప స్థానం ఉపాధ్యా యులకే దక్కుతుందని కొనియాడారు. ప్రపంచాన్ని ఏలే పాలకులు సైతం ఉపాధ్యాయుల చేతిలో రూపుదిద్దుకున్నవారేనని, సమాజ వికాసంలో వారి సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ప్రత్యేక కృషి జరుగుతోందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తూ, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొంటూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా విద్యాబోధనలో విశేష ప్రతిభ కనబరిచిన 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నిమ్మనగోటి వెంకట రమణ, చింతకాయల పుల్లయ్య, పుట్ట రాము లు, దేశపాక కృష్ణ, లింగయ్య, శ్రీనివాస్, మిట్టపల్లి మురళయ్య, పండరి, ఎం. ఏ. గఫూర్ తదితరులతో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. అదేవి ధంగా చందుపట్ల ఎం.జె.పి. బాలికల పాఠశాలలో టిజిటిగా ఫిజిక్స్, సైన్స్ బోధిస్తున్న కొండ్ర సైదమ్మను ఉత్తమ ఉపాధ్యా యురాలిగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఓ,ఏయంసి చైర్ పర్సన్ చేతుల మీదుగా కొండ్ర సైదమ్మకి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పనసం మాధవి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కొండ్ర సైదమ్మని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎంఈఓగా మైనం శ్రీలత



భానుపురి /కట్టంగూర్

మండల నూతన విద్యాధికారిగా మైనం శ్రీలత స్థానిక ఎంఆర్సీ భవనంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంఈఓగా సేవలందించిన అంబటి అంజయ్య వ్యక్తిగత కారణాల వల్ల బాధ్యతల నుంచి తప్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి లిఖితపూర్వకంగా విన్నవిం చారు. ఆయన విన్నపాన్ని పరిశీలించిన డీఈఓ మండలం లోని పామనగుండ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలిగా పనిచేస్తున్న మైనం శ్రీలతను ఎంఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నూతన ఎంఈఓ శ్రీలత మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి నా వంతు పూర్తి కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయు లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి శ్రమిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈఓ అంబటి అంజయ్య, ఆయిటిపాముల హైస్కూల్ హెచ్ఎం కక్కిరేణి బద్రీనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిమ్మనగోటి వెంకటరమణ, చింతకాయల పుల్లయ్య, పుట్ట రాములు, మిట్టపల్లి మురళయ్య, సమ్మెట తిరుమలేష్, శ్రీనివాస్, యంఐఎస్ కోఆర్డినేటర్ కొప్పు గోవర్ధన్, సిఆర్పీలు పోలగోని రవికుమార్, పోలగోని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.